ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

బుధవారం 16 అక్టోబరు 2024

10రోజుల్లో రూ.500కోట్లకుపైగా లావాదేవీలు

బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక మైసూరు దసరా ఉత్సవాలు పర్యాటకశాఖకు మరింత ఉత్తేజానిచ్చాయి. పదిరోజుల్లో రూ.500 కోట్లకు పైగా లావాదేవీలు సాగాయి. అన్ని రకాల వ్యాపారాలు జోరుగా జరిగాయి. దసరా ఉత్సవాలకు 16లక్షలమందికి పైగా తరలివచ్చారు. ఈనెల 3న ఉత్సవాలు ప్రారంభం కాగా 13న విజయదశమితో ముగిశాయి. జంబూసవారి ఉత్సవాలను 8 లక్షలమందికి పైగా వీక్షించారని తెలుస్తోంది. హోటల్ రంగంలోనే సుమారు 110 కోట్ల రూపాయలు లావాదేవీలు సాగాయి. ఇటీవలి కాలంలో స్తబ్దుగా మారిన పర్యాటక రంగానికి ఉత్సవాలు కొత్తశక్తినిచ్చాయి.



తీన్‌మార్..!

- ఉపసమరానికి మోగిన నగారా
- చన్నపట్టణ, శిగ్గావి, సండూరు స్థానాలకు ఎన్నికలు
- కేంద్రమంత్రి కుమార వర్సెస్ డీసీఎం
- వారసులపైనే మూడుపార్టీల వ్యూహాలు

13న పోలింగ్

మూడు శాసనసభ స్థానాలకు నవంబరు 13న పోలింగ్ జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈనెల 18న శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజునుంచే నామినేషన్‌లు స్వీకరిస్తారు. మూడు నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల స్వీకరణ సాగనుంది. ఈనెల 25వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. 28వరకు పరిశీలన సాగుతాయి. 30వ తేదీవరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. నవంబరు 13న పోలింగ్ జరగనుండగా నవంబరు 23న ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది.

776 పోలింగ్ కేంద్రాలు

మూడు నియోజకవర్గాలకు 776 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేయగా 557 ప్రాంతాల్లో ఎన్నికలు జరగనున్నాయి. శిగ్గావిలో 241, సండూరులో 259, చన్నపట్టణలో 276 ఉన్నాయి.



బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉప ఎన్నికల నగారా మోగింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన ఆరు నెలలకు రాష్ట్రంలో మరోసారి మూడు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలతో రాజకీయం వేడెక్కింది. రామనగర జిల్లా చన్నపట్టణ, హావేరి జిల్లా శిగ్గావి, బళ్ళారి జిల్లా సండూరు స్థానాలకు ఉప ఎన్నికలు నవంబరు 13న జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ ప్రకటించింది. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమనేది తెలిసిందే. వీటిని మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మిగిలిన రెండు స్థానాలకంటే చన్నపట్టణపై కేంద్రమంత్రి కుమారస్వామి, డీసీఎం డీకే శివకుమార్‌లు పట్టు సాధించేందుకు రెండు నెలలుగా కసరత్తు కొనసాగిస్తున్నారు.

ఓటర్ల వివరాలిలా...

హావేరి జిల్లా శిగ్గావిలో 2,36,790మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,21,067 మంది పురుషులు కాగా 1,15,717మంది మహిళలు, ఆరుగురు మంగళముఖిలు ఉన్నారు. బళ్ళారి జిల్లా సండూరులో 2,36,047 మంది ఓటర్లు కాగా 1,17,739మంది పురుషులు, 1,18,279 మంది మహిళలు, 29మంది మంగళముఖిలు ఉన్నారు. రామనగర జిల్లా చన్నపట్టణలో 2,32,826 మంది ఓటర్లు ఉన్నారు. 1,12,271 మంది పురుషులు, 1,20,557మంది మహిళలు, 8మంది మంగళముఖిలు ఉన్నారు. ఇక ఎన్నారై ఓటర్లు శిగ్గావిలో ఒకరు, రామనగరలో ఆరుగురు ఉండగా సండూరులో ఎవరూ లేరు.



ఆ స్థానాల్లో ఎన్నికలు ఎందుకంటే..

ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్న ముగ్గురు ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఎంపీలుగా గెలుపొందడంతో ఉపసమరం సాగుతోంది. రామనగర జిల్లా చన్నపట్టణ నుంచి సుదీర్ఘకాలంగా కుమారస్వామి ప్రాతినిత్యం వహించారు. 2023 ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు జేడీఎస్-బీజేపీ పొత్తు కారణంగా కుమారస్వామిని కేంద్ర కేబినెట్‌లోకి చేర్చుకునేందుకు బీజేపీ అగ్రనేతల సూచన మేరకు లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. అందుకు అనుగుణంగానే మండ్య ఎంపీగా గెలుపొంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో కుమారస్వామి భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇక హావేరి జిల్లా శిగ్గావి నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చిన బసవరాజ్ బొమ్మై మరోసారి ఎమ్మెల్యే అయినా బీజేపీ అగ్రనేతల సూచనతో హావేరి నుంచి ఎంపీగా విజయం సాధించారు. బళ్ళారి జిల్లా సండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే తుకారాం ఎంపీ అయ్యారు. ముగ్గురు ఎమ్మెల్యేలు లోక్‌సభ సభ్యులు కావడంతో శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చాయి.



కుమార వర్సెస్ డీకే..

మూడు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగుతుండగా ఒక్కో స్థానం ఒక్కో పార్టీ అభ్యర్థి గత ఎన్నికల్లో గెలుపొందారు. శిగ్గావి, సండూరులకంటే చన్నపట్టణ ప్రతిష్ఠాత్మకం అవుతోంది. కేంద్రమంత్రి కుమారస్వామి సొంత నియోజకవర్గాన్ని వదులుకునేందుకు సుముఖంగా లేరు. మరోవైపు డీసీఎం ఈ ఎన్నికల్లో చన్నపట్టణను దక్కించుకోవాలని పట్టుబట్టారు. ఇలా ఇద్దరు నేతలు చన్నపట్టణపై ప్రత్యేక దృష్టి సారించారు. దాదాపు రెండు నెలలుగా ఇద్దరు నేతలూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. డీసీఎం డీకే శివకుమార్ గ్రామస్థాయిలో భారీ సభలు నిర్వహించి ప్రజలను ఆకర్షిస్తున్నారు. నియోజకవర్గానికి భారీగా గ్రాంట్లను ప్రకటించారు. మరోవైపు చన్నపట్టణ నగరసభలో 13మంది జేడీఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్‌లోకి రప్పించుకోవడం ద్వారా సత్తా చాటారు. 'కాంగ్రెస్ అభ్యర్థి నేనే' అంటూ డీకే శివకుమార్ పలుమార్లు ప్రకటించారు. అయితే ఈ స్థానం నుంచి డీకే శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ అభ్యర్థి అయ్యే అవకాశం ఉంది. జేడీఎస్ నుంచి కేంద్రమంత్రి కుమారస్వామి వారసుడు నిఖిల్ అభ్యర్థి అయ్యే అవకాశం ఉంది. ఇదేస్థానం నుంచి గతంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగాను, మంత్రిగాను వ్యవహరించి ప్రస్తుతం బీజేపీలో క్రియాశీలక నేతగా వ్యవహరిస్తున్న సీపీ యోగేశ్వర్ ఎన్నికల్లో పోటీ చేయాలని తీర్మానించారు. పార్టీ టిక్కెట్ దక్కకపోతే ఇండిపెండెంట్‌గా అయినా బరిలోకి దిగుతానని ప్రకటిస్తున్నారు. ఇది పెనుసవాల్‌గా మారుతోంది. ఇక శిగ్గావిలో బీజేపీ తరపున బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మై అభ్యర్థి అవుతారనే ప్రచారం సాగుతోంది. శశిధర్ ఎలిగార, శ్రీకాంత దుండిగౌడర పేర్లు వినిపిస్తున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి సవనూరు దొడ్డహుణసె కల్మఠద చన్నబసవేశ్వర స్వామీజీ, కురుబ శంకర్ ప్రయత్నిస్తున్నారు. సండూరు నుంచి ఎంపీ తుకారాం భార్య అన్నపూర్ణ పేరు ప్రధానంగా వినిపిస్తున్నా పలువురు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. బళ్ళారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. బళ్ళారిలో అభ్యర్థి ఎంపిక గాలి జనార్ధనరెడ్డి నిర్ణయంపై ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. కొన్నేళ్లకాలంగా బళ్ళారికి దూరంగా ఉన్న గాలి జనార్ధనరెడ్డి ఇటీవలే దసరా వేళ బళ్లారికి చేరుకున్నారు. దీంతో బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. ఆయన ఎవరిని నిర్ణయిస్తారనేది త్వరలోనే తేలనుంది.



ముడా అధ్యక్షుడిపై వేటుకు సిద్ధం..!

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'ముడా'లో సీఎం సిద్దరామయ్య భార్యకు 14 ఇంటి స్థలాలు కేటాయించిన వివాదం తీవ్రస్థాయికి చేరడంతో ముడా అధ్యక్షుడు మరిగౌడపై వేటుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈమేరకు మరిగౌడను తప్పించి పాలనాధికారిని నియమించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోగా త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తారని సమాచారం. అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని మరిగౌడకు సూచించినట్లు తెలుస్తోంది. ఏ క్షణంలోనైనా అతను రాజీనామా చేసే అవకాశం ఉంది. ఆ వెంటనే పాలనాధికారిని నియమించదలిచారు. సీఎం సిద్దరామయ్యకు అత్యంత ఆప్తుడిగా మరిగౌడకు పేరుంది. కానీ వివాదం తీవ్రం కావడంతో దసరాకు ముందే రాజీనామా చేయాలని మరిగౌడకు సీఎం సిద్దరామయ్య సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఉత్సవాలు ముగిశాక రాజీనామా చేస్తానని మరిగౌడ కోరినట్లు తెలుస్తోంది. దసరా ఉత్సవాల ప్రారంభానికి మైసూరు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రిని స్వాగతించే సందర్భంగా మరిగౌడను ఘెరావ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఎమ్మెల్సీ, సీఎం కుమారుడు యతీంద్ర మైసూరులో మీడియాతో మాట్లాడుతూ ముడాలో అవినీతి తారస్థాయికి చేరిందని, ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని అందుకే కెంపణ్ణ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీన్నిబట్టి ప్రక్షాళన పేరిట మరిగౌడను తప్పించనున్నట్లు తెలుస్తోంది.



హైకోర్టులో దర్శన్ బెయిల్ పిటిషన్

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో జైలుపాలైన నటుడు దర్శన్ బెయిల్‌కోసం హైకోర్టును ఆశ్రయించారు. 57వ సీసీహెచ్ కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో దర్శన్ తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు రెండు నెలలకుపైగా దర్శన్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోలేదు. కోర్టులో చార్జ్‌షీట్ నమోదైన తర్వాత బెంగళూరు 57వ సీసీహెచ్‌కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నారు. రెండువారాలపాటు సుదీర్ఘవాదనల తర్వాత తీర్పును రిజర్వులో ఉంచిన న్యాయమూర్తి సోమవారం బెయిల్ పిటీషన్‌ను తిరస్కరించినట్లు ప్రకటించారు. దీంతో బళ్ళారి జైలులో గడుపుతున్న దర్శన్ ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఆయన తరపు న్యాయవాదులతో భార్య విజయలక్ష్మి చర్చలు జరిపినట్లు సమాచారం. ఈమేరకు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బండరాయి దొర్లిపడి ముగ్గురి దుర్మరణం

రాయచూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బండరాయి దొర్లిపడి ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. రాయచూరు జిల్లాలోని లింగసుగూరు తాలూకా గౌడూరు తండాలో మంగళవారం ఈ ఘోరం జరిగింది. మృతి చెందిన వారిలో ఇద్దరు చిన్నారులు, ఓ యువకుడు ఉన్నారు. ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తండాకు చెందిన ముగ్గురు పిల్లలు మంజునాథ(8), వైశాలీ(7), రఘు(21) పొలానికి వెళ్లి గుట్ట సమీపంలో ఆడుకుంటూ బండరాయి వద్దకు వెళ్లారు. అకస్మాత్తుగా ఆ రాయి దొర్లిపడి పిల్లలపై పడడంతో వైశాలీ, మంజునాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. రఘుకు తీవ్ర గాయాలు కావడంతో లింగసుగూరు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రఘు మృతి చెందాడు. పొలంలో పని చేస్తున్న తల్లిదండ్రులు పిల్లలు అరుపులు విని పరుగులు తీశారు. బండను తొలగించే ప్రయత్నం చేయగా వారితో సాధ్యం కాలేదు. కళ్లెదుటే చిన్నారులు మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన వైశాలీ మూడవ తరగతి, మంజునాథ ఏడవ తరగతి చదుతున్నవారని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



చిన్నారుల మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మాన్యతా టెక్‌పార్క్ వద్ద పెద్దఎత్తున చేరిన నీరు

నగరం.. జలదిగ్బంధం..!

- రాజధానిని కుదిపేసిన వర్షాలు
- రాష్ట్రవ్యాప్తంగా అదేజోరు
- స్తంభించిన ట్రాఫిక్
- నేడు పాఠశాలలకు సెలవు

బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రాన్ని మంగళవారం వర్షం కుదిపేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వాన హోరెత్తించింది. తీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి పరిధిలో వర్షంతోపాటు ఈదురుగాలులు ఇబ్బంది పెట్టాయి. మలెనాడు జిల్లాలతోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. మలెనాడు, తీరప్రాంతం, ఉత్తర కర్ణాటకలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాయుగుండం తోడైంది. బెంగళూరు నగర పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం రోజంతా కురిసింది. నగర పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాగవార లుంబిని గార్డెన్ పరిధిలో రోడ్డుపై భారీగా నీరు చేరడంతో గంటలతరబడి వాహనాలు నిలిచిపోయాయి. ప్రముఖ ఐటీ కంపెనీలకు నెలవైన మాన్యతాటెక్ పార్క్ ప్రాంతంలో ప్రజలు సంచరించేందుకు ఇబ్బంది పడ్డారు. మారతహళ్ళి, కేఆర్‌పురం, వైట్‌ఫీల్డ్ ప్రాంతాలలో రోడ్డెక్కినవారు గంటలతరబడి కదలలేకపోయారు. ఇక ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు జనం వెనుకడుగు వేశారు. సిల్క్‌బోర్డ్, బన్నేరుఘట్టరోడ్డు, జయనగర్, మైసూరు రోడ్డు, హెబ్బాళ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. మరో మూడు రోజులు భారీగా వర్షాలు ఉంటాయని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించడంతో బుధవారం నగరంలోని అన్ని పాఠశాలలు, హైస్కూళ్లకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 20వరకు దసరా సెలవులు ఉన్నాయి. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు సోమవారం ప్రారంభమయ్యాయి. అయితే డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లమా కళాశాలలు యథావిధిగా పనిచేయనున్నాయి. కానీ విద్యార్థులు కళాశాలలకు వచ్చివెళ్లే సమయంలో ప్రమాదాలు జరగకుండా సురక్షితమైన విధానాలు పాటించాలని, శిథిలావస్థకు చేరిన భవనాల్లో తరగతులు నిర్వహించరాదని, ప్రస్తుతం వర్షాల కారణంగా అత్యవసరంగా సెలవు మంజూరు చేసిన మేరకు శనివారం మధ్యాహ్నం లేదా ఆదివారంలో ఒకరోజు అదనపు తరగతులు కొనసాగించాలని సూచించారు. కళాశాల విద్యార్థులకు ప్రకృతి వైపరీత్యాలు ఎలా నిభాయించాలనేది సమాచారం ఇవ్వాలని కళాశాలల వాహనాలను పర్యవేక్షించాలని విద్యార్థులు నీరు నిల్వ ఉండే తగ్గు ప్రదేశాలకు వెళ్లరాదని సూచించారు. నగర వ్యాప్తంగా వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది.





వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని ఓ అండర్‌పాస్ వద్ద ఇలా..

తుఫాన్‌తో రైతులకు ఇబ్బందులు

కంప్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంప్లి తాలుకా పరిధిలోని నది ఒడ్డున బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు, రుద్రపాదం గ్రామాల్లో విరగకాచిన వరి పంట నేలకొరిగింది. తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపానుకుతోడు రెండు మూడు రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రతి యేటా వర్షాభావంతో పంటలు నష్టపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు అకాలవర్షాలు, తుఫానులతో ఈ యేడాది నష్టపోయి రైతులు రోడ్డుపాలు కావడం తప్పదని వాపోతున్నారు.



సన్నాపురం వద్ద నేలకొరిగిన వరి పంట



శేషాద్రి రోడ్డులో..



ఓకలీపురం అండర్‌పాస్ సమీపంలో..



విధానసౌధ వద్ద..



శేషాద్రి రోడ్డులో ట్రాఫిక్

మైసూరు రోడ్డులో..




తడవకుండా.. వడి వడిగా..







చిటపట చినుకులు

అల్ప పీడనం అనంతను తడిపేస్తోంది. రెండు రోజులుగా మబ్బులు కమ్మిన ఆకాశం ఒక్కసారిగా వాతావరణాన్ని మార్చేసింది. అనంతపురం నగరంలో మంగళవారం ఉదయం వానలో తడుస్తూ.. చలికి వణుకుతూ చిన్నారులు బడికి, పెద్దలు పనులకు హడావుడిగా వెళ్లడం కనిపించింది. ఎప్పటిలాగానే చిన్నపాటి వానకే రోడ్లు కాలువలయ్యాయి. డ్రైనేజీలో నీరు రోడ్డు మీదకు వచ్చింది. వాహనాలు రయ్ రయ్‌మని దూసువెతుంటే.. తారు రోడ్లు నొప్పి భరించలేక కెవ్వున అరుస్తూ నీటిని పాదచారులపై చిమ్ముతూ కనిపించాయి. మరో రెండు మూడు రోజులపాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు జాగ్రత్తగా ఉండాలి. మరీ ముఖ్యంగా.. ఇళ్లలోకి నీరు చొరబడే ప్రమాదం ఉన్నవారు తిండిగింజలు, సామగ్రిని భద్రపరుచుకుంటే మేలు.

-అనంతపురం అర్బన్




స్నేహం మధురం

కొట్లాడకుండా.. భద్రత



యాడికి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు జరిగే ప్రమాదం ఉండటంతో పోలీసులు పట్టణంలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. యాడికి సీఐ ఈరన్న, యాడికి రూరల్ సీఐ రామసుబ్బయ్య, తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం పట్టణంలో పర్యటించి భద్రతను పర్యవేక్షించారు. యాడికి మండలంలో నాలుగు ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి ఉండగా.. ఇందులో మూడింటిని టీడీపీ వర్గీయులు దక్కించుకున్నారు. ఒక దుకాణాన్ని వైసీపీ వర్గీయుడు దక్కించుకున్నారు. యాడికిలో ఏర్పాటు చేయనున్న ఆ ఒక్క మద్యం దుకాణం విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాలవారు సోమవారం రాత్రి పరస్పరం దాడులకు ప్రయత్నించారు. ముందుగానే పసిగట్టిన పోలీసులు వారిని చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి వచ్చేదాకా భద్రత కొనసాగించాలని నిర్ణయించారు.

జీడిపల్లికి 1144 క్యూసెక్కుల వరద

బెళుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1144 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ఫేజ్-2కు 1104 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.634 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చిలమకూరు వద్ద ఇసుక రీచ్

హద్దులు గుర్తించిన అధికారులు

యల్లనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నదిలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. చిలమకూరు సమీపంలోని నదిలో మంగళవారం హద్దులు ఏర్పాటు చేశారు. చిలమకూరు, కోడిమూర్తి గ్రామాల మధ్య 4.230 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 63 వేల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చాయి. దీంతో రీచ్ ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ డీడీ వెంకటేశ్వరరావు, తాడిపత్రి ఏడీఏ ఓబుల్‌రెడ్డి హద్దులు ఏర్పాటు చేశారు. రీచ్‌లో త్వరలో ఇసుక తవ్వకాలు ప్రారంభమవుతాయని, కాంట్రాక్టర్ అందుబాటులో ఉన్నారని వారు తెలిపారు. ఇసుక తవ్వకాలతో తమకు వరద ముప్పు ఉంటుందని, వేరే ప్రాంతంలో రీచ్ ఏర్పాటు చేయాలని చిలమకూరు గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, మార్చడానికి వీలుకాదని అధికారులు వారికి నచ్చజెప్పారు.


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

న్యూస్ బాక్స్

రేపు వాల్మీకి జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహిస్తున్నామని ఆ శాఖ డీడీ కుష్బూ కొఠారీ తెలిపారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు నగరంలోని గుత్తి రోడ్డు బల్లా కన్వెన్షన్ హాల్‌లో వేడుకలు మొదలౌతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్, పలువురు రాష్ట్రస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. వేడుకలలో పాల్గొనేవారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, కులసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

మార్కెట్‌కు భారీగా టమోటా

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు దిగుబడుల రాక మరోమారు పెరిగింది. కొన్ని రోజులుగా దిగుబడులు తగ్గిపోయాయి. ఈ క్రమంలో రైతులకు మంచి ధర లభించింది. తాజాగా దిగుబడులు పెరగడంతో మార్కెట్‌కు మంగళవారం 2700 టన్నుల టమోటాలు వచ్చాయి. దిగుబడుల పెరుగుదల ప్రభావం ధరలపై పడే అవకాశం ఉంటుందని వ్యాపారవర్గాలు అంటున్నాయి. వాతావరణంలో మార్పులు, తుఫాను ప్రభావం కూడా టమోటా పడే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్‌లో మంగళవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.50 పలికాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.25 పలికాయని ఆయన తెలిపారు.

19న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమౌతుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత జూలై 9న మొదటి సమావేశం నిర్వహించారు. ఇది రెండో సమావేశం. తొలి సమావేశం కొత్త ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు స్వాగతం పలకడం, పలకరింపుల కారణంగా సాదాసీదాగా సాగింది. రెండో సమావేశం ఇందుకు భిన్నంగా, ప్రజా సమస్యలపై చర్చ జరిగేలా ఉంటుందని భావిస్తున్నారు.

గమనించండహో..!

ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఈ నెల 16, 17,18 తేదీల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూల తేదీలు మార్చినట్లు తెలిపారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ అభ్యర్థులకు 23న, కళ్యాణదుర్గం డివిజన్ అభ్యర్థులకు 24, గుంతకల్లు డివిజన్ అభ్యర్థులకు 25వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పీడీ పేర్కొన్నారు.

అలజడి

జడివానకు విజృంభిస్తున్న తెగుళ్లు
తీవ్రంగా దెబ్బతింటున్న పంటలు
మందులు వాడినా ప్రయోజనం సున్నా
ఆందోళనలో అన్నదాతలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జడివాన అన్నదాతకు దడ పుట్టిస్తోంది. ఎడతెరిపిలేకుండా వాన కురుస్తుండటంతో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పంటంతా పాడైపోయి దిగుబడి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన



అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ముసురుకున్న మబ్బులతో జడివాన కురుస్తుండటంతో పంటలను అనేక చీడపీడలు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా టమోటా, బీర, వేరుశనగ, కర్బూజ, కలింగర, దానిమ్మ, బొప్పాయి పంటలు దెబ్బతింటున్నాయి. పురుగు మందులు వాడినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదని వారు చెబుతున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో సుమారు 800 ఎకరాలకు పైబడి కర్బూజ, కలింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఈ సారి టమోటా పంటను ఎక్కువగా సాగు చేశారు. కర్బూజ కోత సమయంలో జడివాన రావడంతో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ తెగులు రావడంతో దిగుబడి దారుణంగా పడిపోయి, తొలగించే పరిస్థితులు వస్తున్నాయి. టమోటాకు మచ్చతెగులు వచ్చి, పూతంతా రాలిపోయింది. ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్కసారి మందును పిచికారి చేయాలంటే ఎకరాకు సుమారు రూ. 10 వేలు దాకా ఖర్చు అవుతుండటంతో రైతులు పెట్టుబడికి భయపడుతున్నారు. మచ్చతెగులు వల్ల ఉన్న కాయలు సైతం పనికిరాకుండా పోతున్నాయి. బీర పంటకు కూడా మచ్చతెగులు సోకడంతో ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. దీంతో దిగుబడి ఆశించిన మేర ఉండటం లేదు. వేరుశనగ పంట ఊడలు దిగే సమయంలో జడివాన కురుస్తుండటంతో బూడిద తెగులు విజృంభిస్తోంది. దీంతో దిగుబడి ఏమాత్రం ఉండటం లేదు. కొన్ని చోట్ల బోరు బావుల కింద సాగుచేసిన వేరుశనగ పంటను కోత కోశారు. జడివానతో వేరుశగన కట్టి నల్లగా మారిపోతోంది. పశుగ్రాసానికి పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


వర్షంతో బీర పంటకు సోకిన మచ్చతెగుళ్లు


వర్షం దెబ్బకు టమోటా కాయలపై పూర్తిగా ఏర్పడిన మచ్చలు

టమోటాకు మచ్చతెగులు



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశా. జడివాన దెబ్బకు టమోటాకు పూర్తిగా మచ్చ తెగులు సోకింది. ఈ తెగులు నివారణకు ఒకసారి పురుగు మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ. 10 వేల దాకా ఖర్చు అవుతోంది. ఇంత ఖర్చు పెట్టినా తెగులు అదుపులోకి రావడం లేదు. దీంతో భయమేసి అలాగే వదిలేశాం.

- నరేష్, రైతు, ఒంటారెడ్డిపల్లి

వేరుశనగకు మొలకలు వచ్చాయి

నేను ఐదు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశా. రెండు రోజుల నుంచి పంట కోత కోస్తున్నాం. అయితే జడివానకు వేరుశనగ కట్టి పూర్తిగా నల్లగా మారిపోయింది. కాయలు మొలకెత్తుతున్నాయి. వీటిని వ్యాపారులు కొనేందుకు ముందుకు రారు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇలాగే మరో రెండు రోజులు వర్షం కురిస్తే పంటంతా పూర్తిగా నష్టపోతాం.



- రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

అస్తవ్యస్తం

రేషన్ పంపిణీలో అక్రమాలు, ఇబ్బందులు
బఫర్ స్టాక్ ఇవ్వని పాత డీలర్లు
అందరికీ అందని అన్ని సరుకులు
ఎండీయూ వాహనదారుల ఇష్టారాజ్యం
తక్కువ తూకాలపై కార్డుదారుల ఆగ్రహం


బియ్యం తక్కువగా ఇస్తున్నారని చూపుతున్న లబ్ధిదారుడు సురేష్

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. వైసీపీ పాలనలో ఎదురైన ఇబ్బందులే ప్రస్తుతం కూడా ఉండటంతో రేషన్‌కార్డు లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1645 రేషన్‌షాపులు, 6,67,263 మంది లబ్ధిదారులు ఉన్నారు. నెలకు 9,716 మెట్రిక్‌టన్నుల బియ్యం కేటాయించనున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలవరకు 2,654 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉన్నట్లు అధికారులు తేల్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో డీలర్లను మార్పు చేశారు. కొత్తవారికి పాతవారు బఫర్‌స్టాక్ హ్యాండోవర్ చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా అది జరగలేదు. కానీ సివిల్ సప్లై అధికారులు మాత్రం బఫర్ స్టాక్‌ను తీసేసి బియ్యం కేటాయిస్తూ వస్తున్నారు. దీంతో అందరికీ బియ్యం, ఇతర సరుకులు అందకుండాపోతున్నాయి. జిల్లాకేంద్రంలో రెండు నెలలుగా లబ్ధిదారులకు బియ్యమే ఇవ్వడంలేదు. కనీసం ఈసమస్య ఎవరికి చెప్పుకోవాలో కూడా లబ్ధిదారులకు అర్థం కావడంలేదు. డీలర్లను అడిగితే మాకు వచ్చిన సరుకులే ఇస్తున్నామంటూ చెబుతున్నారు. సచివాలయంలోకి వెళ్లి ఫిర్యాదు చేసినా ఇదిరాజకీయాలతో ముడిపడి ఉండటంతో వారుకూడా ఈవిషయంలో ఏమిచేయలేక పై అధికారులకు చెబుతామని చెప్పి తప్పించుకుంటున్నారు.

తక్కువ తూకాలు

జిల్లాకేంద్రంలో ఏకాలనీకి వెళ్లినా, ఏప్రాంతానికి వెళ్లినా సగం మంది లబ్ధిదారులు బియ్యం ఇవ్వలేదు, కంది పప్పు, చక్కెర ఇవ్వలేదని చెబుతున్నారు. తక్కువ తూకాలు వేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని రెండో రోడ్డులో మంగళవారం ఎండీయూ వాహనంలో 13.5 కిలోల బియ్యం వేసి 15 కిలోలు ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకున్నారు. లబ్ధిదారుడు సురేష్ కొంతమంది మహిళలు ఆ ఎండీయూ వాహన పైలెట్‌తో రగడకు దిగి నిలదీసారు. అయినా ఆయన మాత్రం నేనింతే మీకు దిక్కున్నచోట చెప్పుకోండని చెప్పి వెళ్లి పోయాడు. దీన్ని బట్టి పరిస్థితి ఎంతదారుణంగా ఉందో తెలుస్తోంది.


రెండునెలలుగా ఎండీయూ వాహనం రాలేదని చెబుతున్న మహిళలు

వాహనదారుడిపై చర్యలు తీసుకోవాలి

రెండునెలలుగా బియ్యం వేయడానికి రాలేదు. ఇపుడు ఇచ్చి 13.5 కిలోల బియ్యం ఇచ్చి 15కేజీలు ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ఇదేమి అన్యాయం అని అడిగితే మాపైనే తిరుగుబాటు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడి ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నారు. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సురేష్, కార్డు లబ్ధిదారుడు

మూడు రోజులు వానలు

పంటలను జాగ్రత్తగా చూసుకోండి
రైతులకు వాతావరణ శాస్త్రవేత్తల సూచన

బుక్కరాయసముద్రం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. పంట పొలాల్లో రసాయన ఎరువుల పిచికారీని రైతులు వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.3-30 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.8-23.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చునని తెలిపారు. గాలులు గంటకు 2-7 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 74-88 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

శనగ విత్తుకోండి..

- ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు శనగ పంట సాగుకు అనుకూలమని ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు తెలిపారు. నవంబరు ఒకటో తేదీ వరకూ రైతులు శనగ పంటను సాగు చేసుకోవచ్చుని అన్నారు. ఎకరానికి 30-35 కేజీల శనగ విత్తుకోవాలని సూచించారు. విత్తుకునే ముందు కిలో విత్తనానికి ఎనిమిది గ్రాముల ట్రైకోడెర్మ విరిడి పొడి, 3 గ్రాములథైరమ్ లేదా 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే రోగాలను చాలా వరుకు అరికట్టవచ్చుని తెలిపారు.
- మొక్కజొన్న పంట శాఖీయ దశ నుంచి గింజ అభివృద్ధి దశలో ఉందని తెలిపారు. అందుబాటులో ఉన్న తేమను వినియోగించుకుని మొక్కజొన్న పంటలో నత్రజని యాజమాన్యం చేపట్టాలని సూచించారు.
- అధిక వర్షాలతో ముంపునకు గురైన తోటల్లో వర్షాలు తగ్గిన తరువాత మురుగు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని సూచించారు.
- గాలిలో అధిక తేమ శాతం కారణంగా అరటికి సిగటోక, ఆకు మచ్చతెగులు ఆశించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ తెగుళ్ల నివారణకు మినరల్ ఆయిల్ 5 మి.లీ, డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి రెండు మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

వాల్మీకుల ఆకాంక్షలను నెరవేర్చండి

మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే కాలవ వినతి


నారా లోకేశ్‌కు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితాలో తమను తిరిగి చేర్చాలని వాల్మీకి, బోయలు దశాబ్దాలుగా కోరుతున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో మంత్రి లోకేశ్‌ను మంగళవారం ఆయన కలిశారు. వాల్మీకి జయంతిని రాష్ట్రస్థాయి పండుగగా నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి చిత్రపటాన్ని బహూకరించారు. వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చే అంశం గురించి మంత్రితో చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన కృషిని లోకేశ్‌కు గుర్తు చేశారు. అప్పట్లో ఈ సమస్యపై శాస్త్రీయ అధ్యయనం చేయించారని, కేంద్రానికి సిఫార్సు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని, వాల్మీకుల్లో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. వాల్మీకి, బోయల దశాబ్దాల కలను నెరవేర్చేందుకు ఇదే సరైన సమయమని, ప్రత్యేక చొరవ చూపాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-కలబురగి (వయా గుంతకల్లు) మధ్య నాలుగు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి (నం. 06533) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30వ తేదీ, నవంబరు 2వ తేదీన బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి మరునటి రోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06534) ఈ నెల 31వ తేదీ, నవంబరు 3వ తేదీన ఉదయం 9-35 గంటలకు కలబురగిలో బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

చంద్రశేఖర భారతి 3(జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో హిందూ ధర్మాన్ని ప్రచారం చేసిన ఆధ్యాత్మిక వేత్తల్లో ఒకరైన శ్రీ చంద్రశేఖర భారతి 1892 అక్టోబరు 16న శృంగేరిలో జన్మించారు. పూర్వనామం నరసింహశాస్త్రి. శృంగేరిలోని శారదా పీఠానికి జగద్గురుగా 1912 నుంచి 1954 వరకు కొనసాగారు. జీవన్ముక్తగా పేరొందారు. గురువు నివాసాన్ని అభినవ శంకరాలయ పేరుతో ఆలయంగా తీర్చిదిద్దారు. 1954 సెప్టెంబరు 26న సమాధి అయ్యారు.

ఆస్కార్ వైల్డ్ (జయంతి)



ఐర్లండు దేశానికి చెందిన ఆస్కార్ వైల్డ్ 1854 అక్టోబరు 16న జన్మించారు. నాటక రచయిత, నవలా రచయిత, కవి, కథానికుడు. ఆయన రచనల్లోని చతురత పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. లండన్‌ను విక్టోరియా రాణి పాలించే కాలంలో ప్రముఖ రచయితల్లో ఒకరిగానే కాకుండా ఆయన సమకాలికులలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 46వ యేట 1900 నవంబరు 30న కన్నుమూశారు.

హేమామాలిని (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో అభిమానులచే డ్రీమ్ గర్ల్‌గా పిలవబడిన ప్రముఖ నటి హేమామాలిని తమిళనాడు రాష్ట్రం అమ్మన్‌కుడిలో 1948 అక్టోబరు 16న జన్మించారు. ప్రముఖ భారతీయ నటి, దర్శకురాలు, నిర్మాత, నాట్య కళాకారిణి, రాజకీయ నాయకురాలు. నాట్య కళాకారిణిగాను, నటిగాను గుర్తింపు పొందారు. సుమారు 150 సినిమాల్లో నటించారు. హేమామాలిని, ధర్మేంద్ర హిట్ జంటగా పేరొంది తరువాతి కాలంలో వివాహం చేసుకున్నారు. ఫిలింఫేర్, జీవిత సాఫల్య పురస్కారం, పద్మశ్రీ తదితర అవార్డులు అందుకున్నారు. 2003-09 మధ్య బీజేపీ నుంచి రాజ్యసభ సభ్యురాలిగాను వ్యవహరించారు. 2014 నుంచి మధుర లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

దండమూడి సుమతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దండమూడి సుమతి రామమోహనరావు 1950 అక్టోబరు 16న ఏలూరులో జన్మించారు. పురుషాధిక్యత ఉన్న భారతీయ సంగీత వాయిద్య రంగంలో మృదంగ వాద్యాన్ని వృత్తిగా స్వీకరించిన మొట్టమొదటి మహిళా కళాకారిణి. తండ్రి నిడుమోలు రాఘవయ్య వద్ద మృదంగం నేర్చుకుని పదో ఏటనే కచేరీ నిర్వహించిన ఘనత ఆమెది. ఆకాశవాణిలో ఏ గ్రేడ్ కళాకారిణి. మృదంగ శిరోమణి, మృదంగ మహారాణి, నాద భగీరథి, మృదంగ లయ విద్యాసాగర బిరుదులతో ఆమెను పలు సంస్థలు సన్మానించాయి. మృదంగ సంగీత అకాడమీ ఉత్తమ శ్రేణి వాద్య కళాకారిణిగా ఎంపిక చేసింది. లయవేదిక సంస్థను స్థాపించి భర్త పేరిట మృదంగ కళా కారులను సత్కరిస్తున్నారు. 2009లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 2021లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

నవోమి ఒసాకా (పుట్టిరోజు)



టెన్నిస్ క్రీడాకారిణి నవోమి 1997 అక్టోబరు 16న జపాన్ దేశం ఒసాకాలోని చౌకులో జన్మించారు. 1999లో ఫ్రెంచ్‌లో విలియమ్స్ సోదరీమణులు టెన్నిస్‌లో పోటీ పడడంతో స్ఫూర్తి చెందిన ఒసాకా తండ్రి తన ఇద్దరు కుమార్తెలకు టెన్నిస్ ఎలా ఆడాలో నేర్పించారు. జపనీస్ క్రీడా పరికరాల సంస్థ యోనెక్స్ 2008 నుంచి ఆమెకు రాకెట్లను సరఫరా చేసింది. సింగిల్స్‌లో ఆమెకు ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ ఫస్ట్ ఏసియన్ ప్లేయర్‌గా ప్రకటించింది. నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ అందుకున్నారు. ప్రపంచంలో అత్యంత ప్రభావశీలురు టాప్ 100 జాబితాలో 2019, 2020, 2021లో ఒకరిగా నిలిచారు.

గ్యాంగ్‌రేప్ కేసులో ఐదుగురి అరెస్టు

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. హిందూపురం డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కుటుంబంలో అత్తాకోడలిపై ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దుండగులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సీఐలు అంజనేయులు, కరీం, రాఘవన్, జనార్దన్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారనీ, నిందితుల్లో ఐదుగురిని హిందూపురం డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తమ విచారణలో నిందితులు నేరం ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. హిందూపురం పట్టణంలోని త్యాగరాజ్ నగర్‌కు చెందిన మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్, అంతర్రాష్ట్ర దొంగ ఎరుకల కావడి నాగేంద్ర అలియాస్ నాగ, అలియాస్ రోబో, అదే ప్రాంతానికి చెందిన సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను అరెస్టు చేశామని తెలిపారు. ఎరుకల నాగేంద్ర, సాకే ప్రవీణ్‌కుమార్, పరారీలో ఉన్న చాకలి శ్రీనివాస్ పాత నేరస్థులని తెలిపారు. నాగేంద్ర 37 కేసుల్లో నిందితుడనీ, మరో 30కిపైగా కేసులను కోర్టు కొట్టివేసిందని తెలిపారు. సాకే ప్రవీణ్ కుమార్‌పై లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసు ఉందనీ, పరారీలో ఉన్న మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ చాకలి శ్రీనివాసులుపై హిందూపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో దోపిడీ కేసు ఉందని తెలిపారు. నిందితులు ఆరుగురు రెండు ద్విచక్రవాహనాల్లో చోరీ కోసం వెళ్లారని, అప్పటికే మిల్లు వద్ద వాచ్‌మన్‌గా ఉంటున్న కర్ణాటక కుటుంబంపై కన్నేశారని ఎస్పీ తెలిపారు. రెండు, మూడుసార్లు రెక్కీ నిర్వహించారని, ఈనెల 11న అర్ధరాత్రి దాటాక అక్కడికి వెళ్లి ద్విచక్ర వాహనాలు ఆపారని, కుక్కలు మొరగడంతో వాచ్‌మన్ టార్చ్‌లైట్ వేసి చూశారని తెలిపారు. అరుపులు విని భార్య, కుమారుడు, కోడలు బయటకు వచ్చారన్నారు. ఇద్దరు కాపలా ఉండి, మిగతావారు అత్యాచారానికి పాల్పడ్డారన్నారు.

చెత్త సంస్కరణ.. కొరవడిన నిర్వహణ

బాగేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛత పెంపొందించే దిశగా ప్రభుత్వం స్వచ్ఛభారత్ వంటి పథకాన్ని అమలు చేస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఇందులో భాగంగా చాలావరకు విజయవంతమైనా కొన్ని చోట్ల నిర్వహణ కూడా కరువైన పరిస్థితులు ఉన్నాయి. ప్రత్యేకించి గాంధీ జయంతి రోజున జిల్లా, తాలూకా కేంద్రాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్లపైకి పరకలతో చేరుతుంటారు. స్వచ్ఛతపై పలు ప్రసంగాలు చేస్తారు. చెత్తను సంస్కరించడంపై వివరిస్తారు. ఇది నగర, పట్టణ, చిన్నపట్టణాలకే పరిమితమవుతోంది. కొన్ని గ్రామాలలో కూడా బాగానే అమలవుతున్నా మరికొన్ని గ్రామాలలో డ్రైనేజీలను శుభ్రం చేసి ఎన్ని నెలలు అవుతుందో తెలియదు.

చక్కటి ప్రదేశంలో ఘన, ద్రవ వ్యర్థాల సంస్కరణ కేంద్రం

అవిభాజ్య బాగేపల్లి తాలూకాలోని పాత పాళ్య హోబళి పరిధిలోని తోళ్ళపల్లి, సోమనాథపుర, పాతపాళ్య, నారేమద్దెపల్లి గ్రామ పంచాయతీలనుంచి ఘన, ద్రవ వ్యర్థాలను సేకరించి సంస్కరించేలా తోళ్ళపల్లి, జీ మద్దే పల్లిల మధ్య చక్కటి కొండగుట్టల మధ్య సంస్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సుమారు రెండు ఎకరాలలో జనావాసాలకు దూరంగా నిర్మించారు. అయితే నిర్వహణ కొరవడి దుస్థితికి చేరుకుంది.



స్వచ్ఛ సంకీర్ణ సముదాయభవనం

నామమాత్రంగా ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ

చెత్త సంస్కరణ కేంద్రం లో ప్లాస్టిక్ బాటిళ్ల రాశులు కొద్దీ ఉన్నాయి. ఇతర ఎలాంటి వ్యర్థాలు లేవు. ప్లాస్టిక్ వ్యర్థాలను సంస్కరించే విధానం అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఇనుము, టైర్, రబ్బర్, వ్యవసాయ వ్యర్థాలు, ఆహార పదార్థాల వ్యర్థాలు, చిప్స్ కవర్‌లు, ఆరోగ్యకేంద్రాల వ్యర్థాలు, థర్మాకోల్, ప్లాస్టిక్ కవర్, బట్టలు ఇలా పలు రకాల వ్యర్థాలను సేకరించి సంస్కరించేందుకు ప్రత్యేక తొట్టెలను నిర్మించారు. అయితే అవ న్నీ నామ మాత్రంగా ఉన్నాయి.

చెత్తకుప్పలకు నిప్పు



రాశులుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

చాలా గ్రామ పంచాయతీల నుంచి ప్రతిరోజూ స్వచ్ఛతా కార్యక్రమాలు కొనసాగడం లేదని తెలుస్తోంది. ఒకరో, ఇద్దర పౌరకార్మికులు ఎండిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి ఒకచోట రాశిగా చేరుస్తుంటారు. వీటిని తరలించాల్సి ఉన్నప్పటికీ నెలకోసారి నిప్పు పెడుతున్నారని తెలుస్తోంది. చాలా గ్రామాలలో ప్రజలే తమ ఇళ్ల చుట్టు పక్కల రోడ్లను స్వచ్ఛ పరుచుకుంటున్నారు.

సిబ్బంది కొరత

పలు గ్రామాలనుంచి వ్యర్థాలను సేకరించి సంస్కరించడానికి తోళ్ళపల్లి వద్ద స్వచ్ఛ సంకీర్ణ సముదాయం నిర్మించారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి గౌరవధనం కల్పించడంలో గందరగోళం నెలకొంది. ప్రతి ఇంటినుంచి చెఅత్తను సేకరించేలా సిబ్బందికి ప్రభుత్వం సూచిస్తోంది. అయితే గ్రామీణప్రాంతాల్లో ఇది సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో సిబ్బందికి గౌరవధనం లేదా వేతనం విషయంలో స్పష్టత ఇవ్వడంతోపాటు తగినంత సిబ్బందిని కేటాయిస్తే చెత్త సంస్కరణ కేంద్ర నిర్వహణ సాధ్యమవుతుందని బాగేపల్లి తాలూకా పంచాయతీ ఈఓ రమేశ్ అభిప్రాయపడ్డారు. కాగా సీపీఎం సీనియర్ నాయకుడు చన్నరాయప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో చాలావరకు అవినీతి కారణంగానే ప్రజలకు సజావుగా అందడం లేదన్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన చెత్త సంస్కరణ కేంద్రం వృథాగా మారకుండా అందుబాటులోకి తేవాలన్నారు.

అడవిపందుల దాడులతో పంటనష్టం



నష్టపోయిన వరిపంటను చూపుతున్న రైతు మురళి

బంగారపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సరిహద్దు గ్రామాలు అడవులకు సమీపాన ఉండగా తరచూ వన్యప్రాణుల బెడదను రైతులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి పలు రకాల పంటలను అడవిపందులు నాశనం చేశాయి. తాలూకాలోని కామసముద్ర హోబళిలోని గ్రామాల సరిహద్దున ఏనుగులు, జింకలు, నెమలుల సంచారం ఉంది. ఇటీవల కొంతకాలంగా అడవిపందుల సమస్య అధికమైంది. అడవులకు సమీపాన ఉండే తళూరు, బత్తలహళ్ళి, మల్లేశ్‌పాళ్య, కదిరినత్త, సాకరసనహళ్ళి, కుందరసనహళ్ళి, పోలెనహళ్ళి, బొగ్గలహళ్ళి, దోణిమడుగు, కీరుమండె, చామనహళ్ళి, దొడ్డపన్నాండహళ్ళి, బోడపట్టి, చత్తగుట్టహళ్ళి, కనమనహళ్ళి, దేవరగుట్లహళ్ళి, గుల్లహళ్ళి, మూతునూరు, దిన్నూరు, చిక్కపుర, బోప్పనహళ్ళి, బలమండె, పలమడగు, యరగోళ, యళేసంద్ర తదితర గ్రామాలలో అడవిపందుల బెడద అధికంగా ఉంది. వరి, టమోటా, రాగి, ఆలుగడ్డ, బీన్స్, మొక్కజొన్న, వంకాయ, చిలగడదుంప తదితర కూరగాయలు, పంటలు పండిస్తున్నారు. అడవిపందుల దాడి కారణంగా పంటలకు నష్టం వస్తుండడంతో రైతుల్లో విచారం నెలకొంది. తళూరు గ్రామానికి చెందిన యువరైతు మురళి మాట్లాడుతూ మరో పదిరోజుల్లో వరిపంట కోత కోయాల్సి ఉందని గతరాత్రి అడవిపందులు పంటను నాశనం చేశాయని ఎకరాకు సుమారు 70వేల రూపాయలదాకా ఖర్చు చేశానన్నారు. వన్యప్రాణుల దాడితో నష్టపోయిన తనను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

మహదేవపుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ప్రారంభించారు. బైరతి బండె, బైరతి, బిళిశివాలె, రాంపుర, వారణాసి, మారగొండనహళ్ళి, హళహళ్ళి, కిత్తగనూరు, కురుడు సొణ్ణేనహళ్ళి, కె.దొమ్మసంద్ర గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీ, జలజీవన్ మిషన్, బోరుబావులు, ఇండోర్‌స్టేడియం, రాజకాలువ, వర్షపునీరు కాలువ కల్వర్టు, భారీ నీటి సేకరణ ట్యాంకు, సముదాయ భవనం పనులకు శంకుస్థాపన చేశారు. పనులను గడువులోగా పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు నాణ్యతను పర్యవేక్షించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ హోబళి అధ్యక్షుడు నటరాజ్, ప్రముఖులు నాగరాజ్, రామాంజినప్ప, రమేశ్, సతీశ్, మహేశ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

గుంతల రోడ్డును బాగుచేయండి



చాకవేలు బస్టాప్ ప్రదేశం ఇలా..

చేళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులోని చాకవేలు బస్టాప్ ప్రదేశం గుంతలమయంగా మారింది. ఈ కూడలిలోని గుంతలలో మంగళవారం కురిసిన వర్షంతో నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. బురదమయం కావడంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను పూడ్చి రోడ్డు బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. తాలూకాలోని పలు కూడళ్లలో చాలావరకు ఇదే పరిస్థితి నెలకొందని వెంటనే గుంతలరోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతినగర్‌లో,,,

బంగారపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిరంతరంగా కురుస్తున్న వర్షంతో శాంతినగర్ పరిధిలోని శంకరమఠం వెనుకభాగం రోడ్డు బురదమయంగా మారింది. నూతనంగా భవన నిర్మాణంకోసం తెచ్చిన మన్ను రోడ్డుపైకి చేరింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, సదరు భవన యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని పురసభ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. స్థానికుడు శీన మాట్లాడుతూ నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఎంతో మంది ఉన్నారన్నారు. సదరు భవన యజమాని నిర్లక్ష్యం కారణంగా పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



బురదమయమైన రహదారిని చూపుతున్న స్థానికులు

తిమ్మనాయకనహళ్ళి అధ్యక్షురాలిగా ప్రభావతమ్మ

శిడ్లఘట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని తిమ్మనాయకనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతుదారురాలు ప్రభావతమ్మ ఆనంద్, ఉపాధ్యక్షురాలిగా గంగరత్నమ్మ ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షస్థానంలో పోటీ చేసిన ప్రభావతమ్మకు 9 ఓట్లు, మునిరత్నమ్మకు 5 ఓట్లు దక్కాయి. ఉపాధ్యక్షస్థానంలో పోటీ చేసిన గంగరత్నమ్మకు 8ఓట్లు, వెంకటేశప్పకు 6 ఓట్లు లభించాయి. ఎన్నికల అధికారిగా వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ పీఆర్ రవి ఫలితాలను ప్రకటించారు. ప్రభావతమ్మ, గంగరత్నమ్మలు గెలుపొందినట్లు తెలిపారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను మాజీ మంత్రి వీ మునియప్ప, కాంగ్రెస్ ప్రముఖుడు రాజీవ్‌గౌడ, కేఎంఎఫ్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాస్ తదితరుల అభినందించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న సభ్యులు

జింకను రక్షించిన అధికారులు

శిడ్లఘట్ట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హండిగనాళ గ్రామ పంచాయతీ పైలహళ్ళిలో సుమారు 80 అడుగుల లోతైన బావిలో పడిన కృష్ణ మృగాన్ని (జింకను) రక్షించారు. ఆదివారం రాత్రి గజేంద్రకు చెందిన పాతబావిలో జింక పడిపోయింది. సోమవారం ఉదయం గమనించిన గజేంద్ర స్థానిక అటవీశాఖ అధికారులకు తెలి పారు. వారు అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. ఇలా ఇరుశాఖల అధి కారులు, సిబ్బంది కార్యాచరణ నిర్వహించి జింకను రక్షించారు. ఫారెస్ట్ వాచర్ నవీన్, సిబ్బంది మారేశ్, రవికిరణ్, అగ్నిమాపక అధికారులు కదిరప్ప, రామాంజినప్ప, రేవణ్ణ, రక్షిత్, హరీశ్, అశోక, ఉమేశ్ తది తరులు కార్యాచరణలో పాల్గొన్నారు.



అటవీ అధికారులతో గ్రామస్తులు

తుపాకీతో బెదిరించి దోపిడీ..

బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో బెంగ ళూరులో దోపిడీలు పెరిగిపోతున్నాయి. నగరంలోని ఐదు ప్రాం తాలలో తుపాకీతో బెదరించి దోపిడీలకు పాల్పడిన మహారాష్ట్ర వాసు లు ఇద్దరిని సీసీబీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మహా రాష్ట్రకు చెందిన జాఫర్, ఇమ్రాన్‌లు అరెస్టు అయినవారు. నిందితులు పలు చోట్ల ఇదే తరహాలోనే తుపాకీతో బెదరించినట్లు తెలుస్తోంది. ఇద్దరి నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేను అభినందించిన మెగాస్టార్

▸▸ చిరంజీవి బ్లడ్‌బ్యాంకులో ఎమ్మెల్యే ప్రదీప్ రక్తదానం

బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకులో సోమవారం రక్తదానం చేశారు. హైదరాబాద్ వెళ్లిన ఎమ్మెల్యే సమీపబంధువు రమేశ్ బాబుతో కలసి రక్తదానం చేశారు. అనంతరం చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే ప్రదీప్‌ను మెగాస్టార్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తన సోషల్‌మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.



చిరంజీవితో ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

ఇండియన్ గ్యారేజ్ రాయబారిగా సూర్యకుమార్ యాదవ్



క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్‌తో అభిమానులు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైన్‌లో ప్రముఖమైన ఇండియన్ గ్యారేజ్ సంస్థ ప్రచార రాయబారిగా ప్రముఖ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ నియమింపబడిన విషయం తెలిసిందే. నగరంలోని బ్రిగేడ్‌రోడ్డులో తొలి అవుట్‌లెట్‌ను లాంఛనంగా ఆరంభించారు. షోరూం ప్రారంభానికి వచ్చిన సూర్యకుమార్ యాద వ్‌ను చూసేందుకు క్రికెటర్‌లు, అతడి అభిమానులు పోటెత్తారు. ఇండియన్ గ్యారేజ్ కంపెనీ ఫౌండర్ సీఈఓ అనంత్ టెంటెడ్‌తో కలసి సూర్యకుమార్ ఆరంభించారు. తొలి వందమంది వినియోగదారులు సూర్యకుమార్‌తో కలిసే అవకాశాన్ని కల్పించడంతో బ్రిగేడ్‌రోడ్డు సందడిగా మారింది.

విదేశీ సేవలకు ఉజ్జీవన్‌కు ఆర్‌బీఐ అనుమతి

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా రాణిస్తున్న ఉజ్జీవన్ పూర్తిస్థాయిలో విదేశీ వ్యవహారాలు సాగించేలా ఆర్‌బీఐ అనుమతులు ఏడీ వన్ లైసెన్స్ పొందింది. ఈమేరకు బెంగళూరులో ఉజ్జీవన్ బ్యాంకు ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ విదేశాలలో ఆర్థిక వ్యవహారాలకు అనుమతులు పొందిన మేరకు ఖాతాదారులకు రిటైల్ బ్యాంకింగ్ విభాగంలో మరిన్ని సేవలు సాధ్యమవుతాయని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఎండీ సీఈఓ సంజీవ్‌నౌటియాల్ ప్రకటించారు. బ్యాంకు ఖాతా దారులందరికీ ఈ సేవలను విస్తరింపచేస్తామని కొత్త ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటించారు.

చోరీలకు అడ్డుకట్ట వేయండి



ఆరాతీస్తున్న పోలీసులు

దొమ్మసంద్ర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలో ఇటీవల కాలంలో చోరీలు అధికమైనా వాటిని నియంత్రించడంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దొమ్మసంద్ర పశుచికిత్సాకేంద్రంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం సర్జాపుర పోలీసులు ఘటనా స్థలానికి చేరి అక్కడి సిబ్బందిని విచారించారు. పశువైద్యాధికారి డాక్టర్ రమ్యనుంచి వివరాలు పొందారు. ఎస్సై రేణుకయ్య నేతృత్వంలో మహజరు చేశారు. ఉదయం 9 గంటలకు యథాప్రకారం విధులకు రాగా చోరీని గుర్తించినట్టు డి గ్రూప్ ఉద్యోగి శాంత వివరించారు. వేలాది రూపాయల కంప్యూటర్ ఇతరత్రా వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయన్నారు. కాగా చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు చడ్డిగ్యాంగ్ ఇక్కడ ఏమైనా సంచరిస్తోందా అనేకోణంలో పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

పాముకాటుకు రైతు మృతి



వెంకటరవణ (ఫైల్)

బాగేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పుల్లగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లసానంపల్లికి చెందిన రైతు వెంకటరవణ (52) పాముకాటుకు గురై మృతి చెందాడు. పశువుల మేతకోసం పొలంలో గడ్డిని కోస్తుండగా పాము కరిచింది. చికిత్స కోసం చేళూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్సకోసం చింతామణికి తీసుకెళ్లాలని సూచించారు. చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా అక్కడా సరైన చికిత్స లభించలేదు. దీంతో కోలారు జాలప్ప ఆసు పత్రికి తరలించారు. 13రోజులపాటు సీఈయియూలో చికిత్స పొంది నా శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఘటనపై చేళూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అమ్మ రాలేదని ఆత్మహత్య



శివకుమార్

గొడవ పడి పుట్టింటికి వెళ్లిన తల్లి ఎంత బతిమాలినా తిరిగి రాకపోవడంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద సంఘటన అనంతపురం రూరల్ మండలం తాటిచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. నాగిరెడ్డి, రేణుకమ్మ దంపతులు విభేదాల కారణంగా నాలుగేళ్ల క్రితం విడిపోయారు. భర్త, కుమారుడు శివకుమార్(17)ను వదిలిపెట్టి రేణుకమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. అమ్మ లేకుండా శివకుమార్ ఉండలేకపోయాడు. ఈ నాలుగేళ్లలో ఎన్నోమార్లు వెళ్లి బతిమాలినా ఆమె తిరిగి రాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన శివకుమార్‌ సోమవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచారు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

-అనంతపురం క్రైం(ఆంధ్రజ్యోతి)

వృద్ధురాలి గొలుసు చోరీ

తాడిపత్రి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన వృద్ధురాలు రంగమ్మ మెడలో నుంచి బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లారని పోలీసులు తెలిపారు. ఇంటివద్ద కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌లో వచ్చి ఆమెతో మాట్లాడుతూ ఒకరు బైక్‌లో ఉండి మరొకరు ఆమె చైన్‌ను లాక్కొని పారిపోయారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.95	1,614.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	45,287	1125
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	45,891	9,134
సామర్థ్యం (టీఎంసీలు)	101.58	46.34

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : తాయమ్మదేవికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. నిత్య పూజల్లో భాగంలో అమ్మవారిని అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు మహామంగళ హారతి చేపట్టారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

నీట మునిగిన పురందరదాస మండపం



పురందరదాస మండపం వద్ద నీటి ప్రవాహం

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి 20 క్రస్ట్ గేట్ల ద్వారా 80వేల క్యూసెక్కులకుపైగా నీటిని నదికి విడుదల చేస్తుండటంతో హంపిలోని పురందరదాస మండపం పూర్తిగా నీట మునిగింది. ఈ మండపం ఈసంవత్సరం మునిగిపోవడం మూడోసారి. రుతుపవనాల కారణంగా కూడ్లిగి, కొట్టూరు, హరప్పనహళ్ళి ప్రాంతాల్లోని పలు చెరువులు నిండాయి. హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని మాలవి రిజర్వాయర్ 20అడుగుల ఎత్తు ఉండగా ప్రస్తుతం 14అడుగల నీటితో నిండి ఉంది. రిజర్వాయర్ నిండితే 2టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది.

నేడు ఇంటర్వ్యూ

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పలు ఉద్యోగాల భర్తీ కొరకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పీఎస్ హట్టప్ప మంగళవారం ప్రకటించారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్ కార్యాలయంలో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎఫ్ఎల్ సమస్త ఫైనాన్స్ లిమిటెడ్, భరత్‌కుమార్ హాస్పిటల్‌లోని ఉద్యోగాలను ఇందులో భర్తీ చేస్తామన్నారు. ఇంటర్వ్యూల్లో పాల్గొనడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్ కార్డు స్వీయ వివరాలతో హాజరు కావాలన్నారు. పీయూసీ, ఐటీఐ, డిప్లమా, గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్ కార్యాలయం లేదా 974278891, 9663263086 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ఇంజనీరింగ్ ఫీజు పెంపుపై నిరసన

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో 50శాతం మేనేజ్‌మెంట్ కోటాను రద్దుచేయాలని, ఇంజనీరింగ్ ఫీజు తగ్గించాలని, బళ్లారి జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐడీఎస్ ఓ ఆందోళన చేపట్టింది. అనంతరం పలు డిమాండ్లతో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బళ్లారి జిల్లాధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ నెల రోజులుగా దావణగెర యూబీడీటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ కళాశాలను కాపాడుకునేందుకు పోరాటాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే పురాతన కళాశాలల్లో ఒకటైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా గుర్తింపు పొందిన యూబీడీటీలో 50శాతం సీట్ల ద్వారా విద్యార్థుల నుంచి రూ.97వేలు వసూలు చేయాలని నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. దేశంలోని ఏ ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కళాశాలలోనూ ఇన్ని మేనేజ్‌మెంట్ కోటా సీట్లు లేవన్నారు. ఇంజనీరింగ్ ఫీజు రూ.43వేలు ఇప్పటికే పేద విద్యార్థులు భరించడం కష్టమని, దానిని రూ.97వేలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల ఫీజుల పెంపు తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్‌ఓ జిల్లా కోశాధికారి అనుపమ, శాంతి, ఉమా, ప్రమోద్, నిహారిక, విద్యార్థులు నందిత, రేణుక, తిప్పేశ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసనలో ఏఐడీఎస్ఓ సభ్యులు



కేంద్ర మంత్రి గడ్కరీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ హిట్నాళ్

కేంద్ర మంత్రి గడ్కరీతో ఎమ్మెల్యే భేటీ

గంగావతి రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీని కొప్పళ శాసనసభ సభ్యులు కె.రాజశేఖర్ హిట్నాళ్ మంగళవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా కొప్పళ నగర పరిధిలో పెండింగ్‌లో ఉన్న 3.5 కిలోమీటర్ల జాతీయ రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ రోడ్డు అభివృద్ధి ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. 50వ జాతీయ రహదారికి విద్యుత్ దీపాలు ఏర్పాటు, సీసీ కెమెరాల అమర్చాలని కోరారు. అనంతరం రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణను కలిసి పలు సమస్యలను తెలియజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రహదారుల దుస్థితిపై రైతుల ఆగ్రహం

● నడిరోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



బురదమయమైన రోడ్డుపై నాట్లు వేస్తున్న రైతులు

కంప్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా బళ్లారి, విజయనగర జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పలు రహదారులు ధ్వంసమయ్యాయి. మోకాలిలోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడుతోంది. అడగళి తాలుకాలో భారీ వర్షాలకు శివలింగనహల్లి మార్గం ఉపనాయకనహల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాపురం రోడ్డు బురదమయం కావడంతో రైతు సంఘం రాజ్యాధ్యక్షులు వీర సంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీర సంగయ్య మాట్లాడుతూ నాయకులు రహదారుల భద్రతపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై దృష్టి సారించి మరమ్మత్తులు చేయాలని తెలిపారు.

ప్రమాదాల రహదారి..

● స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు స్థానికుల డిమాండ్



కుడితిని పట్టణ పంచాయతీ వద్ద స్పీడ్ బ్రేకర్ లేని రోడ్డు

కంప్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో పట్టణ పంచాయతీ, మసీదు ప్రధాన స్థలాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని స్థానికులు రమేష్, జాకీర్, మంజునాథ కోరారు. బళ్లారి వైపు వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. గతంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని అలాగే బళ్లారి రోడ్డులో కూడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా అరికట్టాలని రోడ్డు అభివృద్ధి శాఖ అధికారులను కోరారు. గత రెండుమూడు రోజులుగా పట్టణ పంచాయతీ వద్ద ద్విచక్ర వాహనం కారు ఢీకొన్న సంఘటనలు జరిగింది. రాబోయే రోజుల్లో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నామన్నారు.

దర్శన్ అభిమానులకు నిరాశ



బళ్లారి సెంట్రల్ జైలు దగ్గర గుమిగూడిన అభిమానులు

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడైన నటుడు దర్శన్‌కు బెయిల్ వస్తుందని ఆశగా బళ్లారి సెంట్రల్ జైలు దగ్గర గుమిగూడిన అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. సోమవారం సాయంత్రం వరకు అక్కడే వేచియున్న అభిమానులు కోర్టు తీర్పుతో నిరాశ చెందారు. బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురయ్యిందని ప్రకటించగానే ఒక్కొక్కరుగా వెళ్ళిపోయారు. మరోవైపు దర్శన్ భార్య విజయలక్ష్మి జైలు సమీపంలోకి రానున్నట్లు ఉదయం సమాచారం అందింది. ఆమె పర్యటన రద్దయింది. బంధువులు సుశాంత్ నాయుడు, స్నేహితులు ధన్వీర్, హేమంత్ జైలుకు వచ్చి భోజనం, బట్టలు అందించారు. దర్శన్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, ఇటీవల విమ్స్‌కు చెందిన వైద్య నిపుణులతో పరీక్ష చేయించారని తెలిసింది.

ఆర్మీ రిటైర్డ్ అధికారికి ఘన స్వాగతం

రాయచూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో 34 ఏళ్ల పాటు విధులు నిర్వహించి డిప్యూటీ కమాండెంట్‌గా పదవీ విరమణ చేసి తిరిగి వచ్చిన రిటైర్డ్ ఆర్మీ అధికారి వెంకటేశ్ ఇటగికి నగరంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ నుంచి సవిత సమాజం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి స్టేషన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్, బాబు జగ్జీవన్ రాం సర్కిల్, తీన్ ఖందిల్ మీదుగా ఆయన నివాసానికి ఓపన్ టాప్ జీప్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకటేశ్ ఇటగి ఆర్మీలో సహజంగా 15 ఏళ్ల సర్వీస్‌తోనే చాలా మంది పదవి విరమణ పొంది ప్రత్యామ్నాయం చూసుకుంటారని తాను ఇష్టపూర్వకంగానే 34 ఏళ్ల పాటు సేవలందించానన్నారు. సరిహద్దులో దేశరక్షణ కోసం చేస్తున్న సేవలు దేనికీ సాటిరావని నేటి తరం యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న అగ్నివీర్ పథకాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అధికారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న అభిమానులు

నగరంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



అనంతపురం రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

బళ్ళారి గాంధీనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంగం సర్కిల్ నుంచి బైపాస్ రోడ్డు వరకు గల అనంతపురం రోడ్డులో పలు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని పలు స్వచ్ఛంద సంఘాలు, ప్రజల పిర్యాదులు అందడంతో ఎట్టకేలకు ప్రజాపనుల శాఖ అధికారులు సోమవారం రాత్రి పలు ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయరు సుధర్ రెడ్డి, స్థానిక ప్రముఖుల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. వర్షా కాలంలో రోడ్డుపైన వర్షం నీరు నిలబడి ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలోనే డ్రైనేజీ కాలువల హోల్స్‌ను తెరచి నీరు నిలబడకుండా చేశారు. మరమ్మతులపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ప్రజల సమస్యల ఆలకింపు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి 2023 నవంబరు 23న 'ప్రజలను వెతుక్కుంటూ మీ గ్రామాల్లో' అనే పథకం ద్వారా ప్రజల సమస్యలను ఆలకించే పథకాన్ని ప్రవేశపెట్టారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆ సర్కిల్ పరిధిలోని ప్రజల సమస్యలను విని పరిష్కరించేలా చేయాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతి నెల మూడో బుధవారం జిల్లాలోని ఏదైనా సర్కిల్‌లో ఉదయం 9 నుంచి మరుసటి రోజు 9 గంటల వరకు జిల్లా కలెక్టర్ బుధవారం 9 గంటల నుంచి సర్కిల్‌లోని ప్రజల బాధలను వినడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సేవలన్ని వారికి చేరేలా చూసేందుకు జిల్లా శాఖ అధికారులు అక్కడే ఉండి క్షేత్రస్థాయి సర్వేల్లో పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

రాయచూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయచూరు-సింధనూరు రాష్ట్ర రహదారి కల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. సోమవారం రాత్రి మాన్వికి చెందిన షేక్ అరాఫత్(34) తన సోదరి వివాహం సందర్భంగా పత్రికలు ఇచ్చేందుకు స్నేహితులు మక్బూల్(38), యాసీన్(4)లతో కలిసి కారులో రాయచూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రాయచూరు నుంచి మాన్విపైపు వస్తున్న లారీ ఒకటి వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్నేహితులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. విషయం తెలుసుకున్న సిరవార పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతదేహాలను మాన్వి తాలూకా ఆస్పత్రికి తరలించి మంగళవారం పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా మృతుల కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద రోదనలు చూపరులను కలిసివేశాయి.

లారీని ఢీ కొన్న కారు



అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

గంగావతి రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పట్టణంలోని అబ్దుల్ కలాం సర్కిల్‌లో మంగళవారం నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా అభిమానులు మాట్లాడుతూ నేటి యువత అబ్దుల్ కలాం ఆదర్శాలు పాటించాలని జీవన విధానాలు, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కలాం చిత్రపటానికి నివాళి అర్పించారు. మహమ్మద్ అల్తాఫ్, నగరసభ సభ్యులు ఉస్మాన్, మహబూబ్ హుసేన్, సురేష్, ఖాసీం సాబు, మహేష్ పాల్గొన్నారు.



కలాంకు నివాళి అర్పిస్తున్న అభిమానులు

అలరించిన గ్రామీణ కళా ఉత్సవం

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కళాఉత్సవం విశేషంగా అలంకరించింది. హలకుంది గ్రామంలో గ్రామీణ కళాఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. కన్నడ సాంస్కృతిక శాఖ వారి నిధుల పథకం కింద హలకుంది గ్రామంలో అభినయ కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ కళా సంభ్రమాన్ని తిలకించడానికి భారీగా జనం తరలివచ్చారు. బయలాట కళాకారుడు భీమారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ కళారూపాలను తీసుకెళ్ళి పరిచయం చేయడంలో అభినయ కళాకేంద్రం చూపుతున్న సాంస్కృతిక ఆసక్తిని ఆయన కొనియాడారు. నాటకం అనంతరం హలకుందిలో మళ్ళీ అలాంటి భక్తి నాటకాన్ని నిర్వహించాలని గ్రామ నాయకుడు గాదిలింగప్ప కళాకారులకు పిలుపునిచ్చారు. తదుపరి తోలుబొమ్మలాట ప్రదర్శన, చారులత బృందం సమష్టి నృత్యం, రుద్రప్ప బృందం శరణ సంగమ నాటకం ప్రజలను ఆకట్టుకున్నాయి.



నాటకంలోని ఓ సన్నివేశం

హోసూరు జోన్

చెరువుకట్ట తెగి నీరు వృథా

హోసూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన కెలమంగలంలో సుమారు 28 ఎకరాల విస్తీర్ణంలోని జంబుఖాన్ కొడగై అనే చెరువుకట్టలు తెగి నీరు వృథా అయ్యింది. చెరువు కింద వెయ్యి ఎకరాలు సాగు అవుతున్నా సరైన పర్యవేక్షణ లేదనే విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో అదనంగా వచ్చేనీరు సనత్ కుమార్ నదిలోకి వెళ్తుంది. చెరువును బాగు చేయాలని రైతులు పలుమార్లు ప్రభుత్వ అధికారులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. రెండు రోజులుగా కెలమంగలం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పట్టామ్మన్ చెరువు సోమవారం నిండడంతో అదనపు నీటిని జెంబుఖాన్ కొడగై చెరువులోకి వదిలారు. వర్షపు నీరు వృథా అవుతుండడంతో స్థానిక రైతులలో ఆందోళన నెలకొంది. తాత్కాలికంగా నిర్మించిన అనకట్ట మంగళవారం పగలడంతో నీరు బయటికి ప్రవహిస్తోంది. నీరు నిల్వ ఉంటే ఏడాది పాటు సాగుకు, తాగునీటికి ఇబ్బంది ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు రైతు సంఘం అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ చెరువును కలెక్టర్ స్వయంగా పరిశీలించి నీరు వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



జంబుఖాన్ కొడగై చెరువు నుంచి వృథాగా వెళ్తున్న నీరు

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న మంత్రి చక్రపాణి

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్ కళింగవరం పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ టవర్, వేప్పన పల్లి పంచాయితీ యూనియన్, కోడిపల్లి పంచాయతీ చీలేపల్లి గ్రామంలో 30వేల లీటర్ల సామర్థ్యంతో రూ.16.75 లక్షలతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించారు. పెరియకొత్తపల్లి గ్రామంలో రూ.5.40 లక్షలు, కుట్టపల్లి గ్రామం బ్లాక్‌రోడ్డులో 135 రేషన్‌కార్డులు కల్గిన చౌకడిపోను ప్రారంభించారు. ఈ సందర్భంగా 22 మందికి పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి ఎ.చక్రపాణి, జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు సమక్షంలో ఎమ్మెల్యే వై ప్రకాశ్ పాల్గొన్నారు. చిన్న మట్టమపల్లి, అగ్రహారం, కళింగవరం, కోడితిమ్మనపల్లి, జేవీకుపాళం, దిన్నూరు గురుమూర్తి కొటాయి, శూలగిరి పంచాయతీ యూనియన్, కాళింగవరం పంచాయతీ పరిధిల్లోని చిన్న మట్టంపల్లి, అగ్రహారం, కాళింగవరం, కోడితిమ్మన్నపల్లి, జేవీకుపాళ్యం, దిన్నూరు గ్రామాలు అటవీప్రాంతానికి సరిహద్దున ఉండడంతో మొబైల్ సిగ్నల్స్ సరిగా అందడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వాహనం, ఇంటర్నెట్ సౌకర్యం తదితరాలకు కూడా సంప్రదింపదించలేని పరిస్థితి నెలకొంది. కాళింగవరం గ్రామ ప్రజల డిమాండ్ల కోసం బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఏర్పాటు చేసి ప్రజల ఉపయోగం కోసం ప్రారంభించారు. దీని వల్ల 4 కిలోమీటర్ల టెలికమ్యూనికేషన్ టవర్, సోలార్ ద్వారా విద్యుత్ లభించనుంది. కొండ గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు. జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షురాలు మణిమేగల నాగరాజ్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారులు కుమరేశన్, సావిత్రి, ఉమాశంకర్, స్థానిక ప్రభుత్వ ఉపాధ్యక్షులు బాగ్యరాజ్, నాగశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగేంద్రకు బెయిల్ మంజూరుతో సంబరాలు



గడిగిచెన్నప్ప సర్కిల్లో సంబరాలు చేసుకుంటున్న నాగేంద్ర అభిమానులు

బళ్లారిరూరల్/సిటీ అక్టోబరు 15: మాజీ మంత్రి నాగేంద్రకు బెయిల్ మంజూరు కావడంతో కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని రాయల్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో బళ్లారి కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ పరిధిలోని జోళదరాసి మారెమ్మ దేవస్థానం సమీపంలో అధ్యక్షులు హెచ్ తిమ్మనగౌడ మారెమ్మ దేవస్థానం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు గుమ్మనూరు జగన్నాథ్, ఎర్రగుడి ముద్దమల్లయ్య, నాగలకేరి గోవిందు, సోము కార్పెంటర్, కవిత వన్నప్ప, మేయర్, నందీష్ బాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నాగేంద్ర రాక కోసం ఘన స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున గుమిగూడారు.

రేపు వాల్మీకి జయంతి వేడుకలు

సిరుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 17వ తేదీ ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఆచరిస్తున్నట్లు తెలిపారు. హైస్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వాల్మీకి చిత్రపటంతో ఊరేగింపు సాగుతుందన్నారు. అనంతరం తాలుకా పంచాయతీ భవనంలో వేదిక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సంఘ సంస్థల పదాధికారులు వాల్మీకి సమాజ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.